## ధాన్యం అన్‌లోడింగ్‌లో జాప్యం వద్దు

### రైతులకు ఇబ్బందులు కలగకూడదు : కలెక్టర్



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం లక్ష్మణచాంద మండలంలోని తిరుపల్లి గ్రామ గోదామును కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడ కొనసాగుతున్న వరి ధాన్యం అన్‌లోడింగ్ పనులను పరిశీలించారు. ట్రాక్టర్ల ద్వారా గోదాముకు చేరుతున్న ధాన్యాన్ని ఎంత వేగంగా దిగుమతి చేస్తున్నారో, నిల్వ సామర్థ్యం ఎంత ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గోదాంలో ఎంత మేర ధాన్యం నిల్వ ఉందో, ఇంకా ఎన్ని వాహనాలు, అన్‌లోడింగ్ కోసం ఎదురుచూస్తున్నాయో వివరాలు తెలుసుకున్నారు.హమాలీలకు తాగునీరు, విశ్రాంతి వంటి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కూడా సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహసిల్దార్ సరితతో పాటు ఇతర అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహ రహిత తెలంగాణే ధ్యేయం

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్:** బాల్య వివాహ రహిత ఆదిలాబాదు జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. మంగళవారం మన్నూర్ గ్రామంలో హహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, టోల్ ఫ్రీ నంబర్ల పోస్టర్లను ఆవిష్కరించారు. బాల్య వివాహాలు జరగకుండా అరికట్టిన గ్రామ పంచాయతీలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. చట్టప్రకారం వివాహానికి అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంత్సరాలు నిండి ఉండాలన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఉల్లంఘిస్తే రెండేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్1098కు సమాచారం అందించాలని కోరారు.అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అధికారి మిల్కా, డీపీఓ రమేష్, సర్పంచ్ పూనమ్ బోడ్కే పాల్గొన్నారు.

## కుట్లు, అల్లికలతో మహిళలు ఆర్థిక అభివృద్ధి

### అదనపు కలెక్టర్ చంద్రయ్య



**ప్రజాపక్షం/దండేపల్లి :** మహిళలు, కుట్లు, అల్లికలు నేర్చుకుంటే వాటి ద్వారా స్వయం ఉపాధి పొంది వాటి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. మంగళవారం దండేపల్లిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలో మహిళలకు నిర్వహిస్తున్న మగ్గం వర్క్ శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు. మహిళలు వేస్తున్న మగ్గం వర్క్, పెయింటింగ్ వర్కును పరిశీలించారు. వీటిని నేర్చుకుని స్వయంగా టైలరింగులు ఏర్పాటు చేసుకోవడం, లేదా మరికొంత మందికి నేర్పించేందుకు శిక్షణ కేంద్రాలు కూడా ఏర్పాటు చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చు అన్నారు. తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపిడిఓ ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, సంస్థ డైరెక్టర్ ఆశిష్, దండేపల్లి గ్రామీణ బ్యాంకు మేనేజర్ భూంరెడ్డి, శిక్షకురాలు దాసరిరమాదేవి పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం / కాగజ్ నగర్:** కాగజ్‌నగర్ మండలంలోని పలు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్, మెషిన్, యాప్‌లలో ఎరువుల నిల్వలు సమానంగా ఉండేలా చూసుకోవాలని డీలర్లకు సూచించారు. యూరియాను అధిక ధరలకు విక్రయించినా, లింక్ ప్రొడక్ట్స్ పెట్టి అమ్మినా లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎరువుల విక్రయాల్లో పారదర్శకత పాటించాలని, ఫర్టిలైజర్ యాప్‌లో రైతులకు ఉన్న సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. ఎరువుల బుకింగ్ విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులు అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్, అగ్రికల్చర్ ఆఫీసర్లను సంప్రదించాలని సూచించారు. ఎరువుల బుకింగ్‌కు మొబైల్ నంబర్ లింక్ లేకపోతే వెంటనే అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ వద్ద అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం కాగజ్ నగర్ మండలంలో 594.38 టన్నుల ఎరువుల నిల్వ అందుబాటులో ఉందని వ్యవసాయ అధికారి రామకృష్ణ తెలిపారు.

## వడదెబ్బతో ఇద్దరు మృతి




**ప్రజాపక్షం / పెంచికలపేట్:** పెంచికల్‌పేట్ మండలంలో వడదెబ్బకు గురై ఇద్దరు మృతి చెందారు. మండలంలోని నందిగాం గ్రామానికి చెందిన తలండి చంద్రయ్య (47) ఆదివారం, గుండెపల్లి గ్రామానికి చెందిన తలండి నారాయణ (61) మంగళవారం తీవ్ర ఎండల కారణంగా అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయారు. ఇటీవలి రోజులుగా మండలంలో ఎండ తీవ్రత, అధిక ఉష్ణోగ్రతలు, వేడిగాలులు ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దని, ఎక్కువగా నీరు తాగుతూ జాగ్రత్తలు పాటించాలని అధికారులు, వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## జూన్ 1న సిఎం పర్యటనకు

# పకడ్బందీగా ఏర్పాట్లు

### కలెక్టర్ కె. హరిత



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** జూన్ 1వ తేదీన కెరమెరి మండలం కోలం కొఠారి గ్రామానికి ముఖ్యమంత్రి విచ్చేస్తున్నందున అందుకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు కోలం కొఠారి గ్రామాన్ని అదనపు కలెక్టర్ డి. దాస్, ఆసిఫాబాద్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ లోకేశ్వర్ రావు, రాష్ట్ర ఇంజనీరింగ్ ముఖ్య అధికారులు, ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం హెలిప్యాడ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, మురికి కాలువల పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, నిరుపయోగంగా ఉన్న పాత నిర్మాణాలను, చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలన్నారు. ప్రారంభించబోయే సీసీ రహదారి ఇరువైపులా ముగ్గులు వేయాలని, ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేందుకు సర్వసిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఇళ్ల ముందు పరిసరాలు శుభ్రంగా ఉంచి, గృహాలను చక్కగా అలంకరించాలన్నారు.సిఎం లబ్ధిదారులతో నేరుగా ముఖాముఖి మా ట్లాడే అవకాశం ఉన్నందున అందుకో సం ప్రత్యేక వేదికను సిద్ధం చేయాలన్నారు. లబ్ధిదారులకు తాగునీటి సరఫరాలో ఎ లా ంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అవసరమైన చోట్ల షామియానా లు, కుర్చీలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతీ ఒక్క అధికారి తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించి ఏర్పాట్లను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రకాష్ రాజు, ఇంజనీరింగ్ శాఖల ఉన్నతాధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, పాల్గొన్నారు.

## విదేశీ వాణిజ్యాన్ని అంది పుచ్చుకునేలా

# రైతులకు తోడ్పాటు




కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/ నిజామాబాద్:** వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లా రైతాంగానికి మరింత ప్రయోజనం కలిగేలా వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ ద్వారా తోడ్పాటునందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను కోరారు. జిల్లా రైతాంగం తమ వ్యవసాయ ఉత్పత్తులను దేశ, విదేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్యపరంగా వారికి అనుసంధానం ఏర్పర్చాలని అభిలాషించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ (డీజీఎఫ్‌టీ), ఎపీఈడీఎ, జాతీయ పసుపు బోర్డు, నా బార్డు, ఇండియా పోస్టల సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు. నూతన ఎగుమతిదారులను ప్రోత్సహి ంచటం, ఎంఎస్‌ఎంఈల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, జిల్లాల స్థాయిలో ఎగుమతులను గణనీయంగా పెంపొందించటమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కామర్స్ ఎగుమతుల ప్రదర్శన, ట్రేడ్ కనెక్ట్ పోర్టల్, పసుపు, వరి, సోయాబీన్, మొక్కజొన్న, పత్తి తదితర పంటల మార్కెట్ వైవిధ్యీకరణ అంశాలపై డీజీఎఫ్‌టీ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు విచ్చేసి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా రైతాంగం సేద్యపు రంగంలో ఆధునిక విధానాలు, శాస్త్రీయ పద్ధతులను అవలంభిస్తూ ఆదర్శ రైతులుగా పేరు పొందారన్నారు. డీజీఎఫ్‌టీ ద్వారా జిల్లా రైతాంగానికి తగిన తోడ్పాటందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు అధికారులు కెవిఎస్ శైలజ, ప్రత్యూష్, వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు విద్య, జనార్ధన్‌రెడ్డి, ఎ సిఐడిఏ అధికారి నాయుడు, నాబార్డు డిజిఎం ప్రవీన్‌కుమార్, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సురేష్‌కుమార్, జిల్లా ఉద్యానశాఖాధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

## వివాహితర సంబంధం, ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భర్త హత్య

**ప్రజాపక్షం/హాజీపూర్:** అక్రమ సంబంధం, ఇన్సూరెన్స్ డబ్బుల ఆశతో ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన ఘటన హాజీపూర్ మండలం గుడిపేట గ్రామంలో సంచలనం రేపింది. గుడిపేట గ్రామానికి చెందిన సాయిని భారతి, ఆమె ప్రియుడు సురేంద్ర కలిసి భర్త సాయికుమార్‌ను హత్య చేయించినట్లు పోలీసులు తెలిపారు. భారతి, సురేంద్ర మధ్య ఉన్న అక్రమ సంబంధం విషయం తెలుసుకున్న సాయికుమార్ మద్యం అలవాటు పడి భార్యను తరచూ హింసించేవాడు. కాగా మృతుడు గ్రామానికి చెందిన రామ్ మల్లేష్ వద్ద 60 వేల రూపాయల అప్పు తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో వారి మధ్య కూడా గొడవలు జరిగాయి. ఈ క్రమంలో భారతి, సురేంద్రలు మల్లేష్‌తో కలిసి సాయికుమార్‌ను హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని కుట్ర పన్నారు. మృతుడి పేరుతో మూడు కోట్ల రూపాయల ఇన్సూరెన్సులు చేయించి, హత్య చేయడానికి 10 లక్షల రూపాయల సుపారీ ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకుని అడ్వాన్స్‌గా 2 లక్షల రూపాయలు ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది.ఆ తర్వాత ఘటనను రోడ్డు ప్రమాదంగా చూపించేందుకు మృతదేహాన్ని, బైక్ ను రోడ్డుపై పడేసి నిందితులు పరారయ్యారు. ఫిర్యాదు అందుకున్న వెం టనే సాంకేతిక ఆధారాలతో వేగంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు తక్కువ రోజుల్లోనే కేసును ఛేదించారు. శ్రీరామ్ కుమార్ అనే మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు ఈ విషయాన్ని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ భాస్కర్ వెల్లడించారు. కేసు దర్యాప్తులో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రకాశ్, ఇన్‌స్పెక్టర్ జి. రవీందర్, సబ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బంది సదానందం, చంద్రశేఖర్, గంగాధర్ కీలకంగా వ్యవహరించారు.



## వివాహిత అనుమానాస్పద మృతి





**ప్రజాపక్షం/నిజామాబాద్:** ధర్పల్లి మండలం గోవింద్‌పల్లి గ్రామానికి చెందిన కర్రోల్ల లక్షిత అలియాస్ కవిత (22) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్ఐ వినయ్ తెలిపారు. వివరాల ప్రకారం మోస్రా గ్రామానికి చెందిన లక్షిత అలియాస్ కవితను మండలంలోని గోవింద్‌పల్లికి చెందిన కర్రోల్ల నెహ్రూను యేడాది క్రితం వివాహం చేసుకుంది. కాగా వివాహమైన రెండు నెలల నుంచి అత్తమామ రాజు, సత్తెవ్వలు అదనపు కట్నం 2 లక్షలు తేవాలని వేధించటంతో పలుమా ర్లు పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి సర్ది చెప్పినా ఎలాంటి మార్పు రాలేదని సోమవారం మళ్లీ అదనపు కట్నం తీసుకరావలని కుమార్తెను వేధించటంతో కుమార్తె మృతి చెందినట్లు తెలిసిందని కుటుంబీకులు తెలిపారు. మృతుని తండ్రి మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని మండల తహసీల్దార్ శాంత పంచానామా నిర్వహించగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని ఏసీపీ పరిశీలించారు.

## ప్రజా సమస్యలను పట్టించుకోరేందుకు?

- వార్డుల సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు
- మరమ్మతుల,రిపేర్ల పేరుతో నిధులు దుర్వినియోగంపై ఆగ్రహం
- డిఈ పద్ధతి మార్చుకోవాలని ప్రజాప్రతినిధుల హెచ్చరిక



**ప్రజాపక్షం/మెదక్ :** వార్డుల్లో ఉన్న సమస్యలు పరిష్కరించకుండా స్థానిక ప్రజాప్రతి నిధులకు సమాచారం ఇవ్వకుండా అధికారులకు కౌన్సిలర్లు అంటే విలువ లేదని వారు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని మెదక్ మున్సిపల్ కౌన్సిలర్లు, ముఖ్యంగా మహిళ కౌన్సిలర్లు గళమెత్తారు. మంగళవారం మెదక్ మున్సిపల్ సాధారణ సర్వసభ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు అధ్యక్షతన, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలోజరిగింది.కౌన్సిలర్లు బట్టి ఉదయ్, మామిల్ల ఆంజనేయులు, శృతి, నర్సిం లు, గంగమణి, పల్లే రాణి, లక్ష్మీ స్వరాగిని, సంధ్యారాణి, గౌస్ ఖురేషిలు మాట్లాడుతూ స్థానిక మార్కెట్లో ఉన్న షాప్‌లను మున్సిపల్ అనుమతి లేకుండా దళారులకు కట్టబెడుతున్నారని, వాటిని వెంటనే రద్దు చేయాలని కోరారు. దాయార రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. వార్డుల సమస్యల పై అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నీళ్ల సమస్యలు, డ్రైనేజీ రోడ్లు సరిగ్గా లేవని, దోమల బెడద తీవ్రంగా ఉందని సభ దృష్టికి తెచ్చారు. బోర్లు, పైపులైన్ల మరమత్తులు, ట్రాక్టర్లు, డోజర్, జెసిబిల రిపేర్ల పేరుతో డిఈ మహేష్ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆయన పద్ధతి మార్చుకోవాలని ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. నాల్గవ వార్డులో మ్యాన్ హోల్స్ నిర్మించాలని, స్మశాన వాటికలో బోరు వేయించాలని కౌన్సిలర్ కోరారు. 17 వార్డు కౌన్సిలర్ ఆరుణ మాట్లాడుతూ తమ వార్డులో మాజీ కౌన్సిలర్లు పెత్తనం చేస్తున్నారని, మాకు సమాచారం ఇవ్వకుండానే అధికారులు పనులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల కోసం పని చేసేందుకు వచ్చామని వారికి అన్యాయం జరిగితే ఊరుకునేదేలేదని, ప్రజల కోసం "మీ పేర్లు రాసిపెట్టి చనిపోతానని" ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద సారు (మైనంపల్లి హనుమంతరావు ) దగ్గరికి వెళ్లి చెప్తానని ఆగ్రహం వ్యక్తం చేశారు. చదువు రాదని చిన్నచూపు చూడొద్దని హెచ్చరించారు. మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. వార్డుల్లో ఉన్న సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరించుకొని ప్రజలకు మెరుగైన పాలన అందించాలని సూచించారు. వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పే ఓపిక ఉండాలని, లేకపోతే ఉద్యోగం వదిలేసి వెళ్లిపోవాలని డిఈ మహేష్‌ను హెచ్చరించారు. ఉద్యోగరీత్యా పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక మార్పుతోనే గ్రామాల అభివృద్ధి

- కెమెరాల నీడలో గ్రామాలు సురక్షితం
- 25సిసి కెమెరాలు,ఆడియో మైక్ సిస్టం
- పోలీస్ కమిషనర్ రష్మీ పెరమాల్





**ప్రజాపక్షం/గజ్వేల్:** గ్రామాలను మరింత సురక్షితంగా, పటిష్టంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మన పోలీస్ మన ఊరు వినూత్న సామాజిక కార్యక్రమాన్ని చేపట్టినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరమాల్ స్పష్టం చేశారు. బుధవారం అహ్మదీపూర్ వద్ద సిద్దిపేట సురక్ష నేత్ర సీసీటీవీల ప్రారంభం, గ్రామ రక్షణే ధ్యేయంగా ఁసిద్దిపేట సురక్ష నేత్ర లను ప్రారంభించి మాట్లాడారు. ప్రధాన ప్రాంతాలను కవర్ చేస్తూ ఏర్పాటు చేసిన 25 సీసీ టీవీ కెమెరాలు, అలాగే ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేందుకు 14 మైకుల ఆడియో కనెక్టివిటీ సిస్టమ్ చక్కటి ఫలితాలు ఇస్తుందని పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి వృద్ధులకు ఆమె చేతికర్రలను పంపిణీ చేశారు. యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా, క్రీడల వైపు దృష్టి పెట్టాలని కాంక్షిస్తూ వాలీబాల్ క్రీడను ప్రారంభించారు. కళా రూపాలతో యాంటీ డ్రగ్స్, రోడ్డు భద్రతపై రూపొందించిన ప్రత్యేక వీడియోను పోలీసులు ప్రదర్శించారు. ఒగ్గు కళాకారులు తమ అద్భుతమైన జానపద పాటలు, నృత్యాల ద్వారా మత్తు పదార్థాలతో జరిగే నష్టాలు, హెల్మెట్ యొక్క ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలకు, పోలీసులకు మధ్య దూరాన్ని తగ్గించి, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడానికే ఈ కార్యక్రమం చేపట్టగా, ప్రజలు తమ సమస్యలను పోలీసులతో ధైర్యంగా, స్వేచ్ఛగా పంచుకోవాలని పోలీస్ కమిషనర్ రష్మీ పెరమాల్ కోరారు. తమకు సంబంధంలేని సమస్యలు దృష్టికి తెస్తే సంబంధిత అధికారులకు పంపిస్తామని తెలిపారు. సీసీటీవీ కెమెరాలు గ్రామ రక్షణ కవచాలు కాగా, వ్యాపార సంస్థలు, దుకాణాలు, వ్యక్తిగత ఇళ్ల వద్ద కూడా సీసీటీవీలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, రాంగ్ రూట్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, అతి వేగం లాంటివి ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. బెజ్జంకి ప్రాంతంలో వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన గ్యాంగ్‌ను పోలీసులు పట్టుకోగా, మహిళలు రాత్రి వేళల్లో బంగారు ఆభరణాలు ధరించి ఇంటి బయట నిద్రించవద్దని సూచించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100 కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ప్రజల శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

- నార్కోటిక్ జాగిలం రోమా సహాయంతో.. 120 గ్రాముల గంజాయి స్వాధీనం
- బోథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- 28 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు తనిఖీ
- నంబర్‌ప్లేట్ లేని 4 బైక్‌లు స్వాధీనం
- ఎ.ఆర్. డి.ఎస్పి ఇంద్రవర్ధన్



**ప్రజాపక్షం / బోథ్ :** ఆదిలాబాద్ జిల్లా బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుట్టపక్క తండా గ్రామంలో మంగళవారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని ఏ.ఆర్. డి.ఎస్పి కమతం ఇంద్రవర్ధన్ ఆధ్వర్యంలో బోథ్ సిఐడి గురుస్వామి, ఎస్.ఐ. వి.పురుషోత్తం సమక్షంలో విస్తృతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఉద యం 6 గంటల నుండి 9 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో వాహనాల తనిఖీలు చేపట్టగా 2 ఆటోలు, 28 ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. అందులో నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 4 బైకులను గుర్తించినట్లు తెలిపారు. అదే విధంగా నార్కోటిక్ జాగిలం రోమా తనిఖీలు నిర్వహించగా అందులో రాథోడ్ న్యాల్‌సింగ్ అనే నిందితుడి వద్ద నుండి 120 గ్రాముల గంజాయిని జాగిలం గుర్తించింబది. వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకుని, బోథ్ పోలీస్ స్టేషన్లో చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి పెండింగ్ లో ఉన్న 15 వాహనాల చలానాల ద్వారా రూ. 16750 జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు. గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం ఇలాంటి కార్డన్ అండ్ సర్చ్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. గంజాయి, మారకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామ ప్రజలు పోలీసులకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్. డి.ఎస్పి ఇంద్రవర్ధన్, బోథ్ సిఐ గురుస్వామి ఆధ్వర్యంలో బోథ్ ఎస్.ఐ. పురుషోత్తం, నేరడిగొండ, బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ.లు, క్యూర్టీ, సివిల్ హెడ్ కానిస్టేబుల్లు బీడి బృందం పాల్గొన్నారు.

## పోలీసుల 'కార్డెన్ అండ్ సర్చ్'

## 138 వాహనాలు స్వాధీనం

**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** జిల్లా ఎస్పి డా.జి.జానకీ శర్మిల , ఐపిఎస్ ఆదేశాల మేరకు నిర్మల్, భైంసా సబ్ డివిజన్ల పరిధిలో పోలీసులు మంగళవారం తెల్లవారుజామున భారీ కార్డన్ అండ్ సెర్చ్ (తనిఖీలు) కార్యక్రమం నిర్వహించారు. భైంసా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్‌బోరి గ్రామంలో, నిర్మల్ సబ్ డివిజన్ పెంబి మండలంలోని బాబాపూర్ (ఆర్) గ్రామాల్లో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డిఎస్పి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో భాగంగా సరైన పత్రాలు లేని 135 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు తప్పనిసరిగా పూర్తి పత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటూ, 105 పెండింగ్ చలాన్ల ద్వారా రూ. 18275 నగదును వసూలు చేశారు.

### నేరాల నివారణపై అవగాహన సదస్సు

తనిఖీల అనంతరం గ్రామ ప్రజలతో పోలీసులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో భద్రత కోసం సిసి కెమేరాల ఏర్పాటు చేసుకోవలని, వాటి ప్రాముఖ్యతను వివరించారు. యువత భవిష్యత్తును పాడుచేసే గంజాయి వినియోగం, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్ డ్రైవింగ్ వంటి సామాజిక దుష్ప్రవర్తనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ ట్రాపిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఖానాపూర్ ఇన్స్‌పెక్టర్ అజయ్, భైంసా రూరల్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ కుమార్, స్థానిక ఎస్.ఐ.లు, పోలీస్ సిబ్బంది మరియు గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

